సాక్షి
ఖమ్మం
గురువారం । 7 । నవంబర్ । 2024



వేతన వెతలు
అప్‌గ్రేడ్ అయిన అంగన్‌వాడీ సెంటర్లలోని టీచర్లకు కొత్త వేతనాలు అందక, ఇతర నిధులు విడుదల కాక ఇబ్బంది పడుతున్నారు. 10లో



మిరపను ఆశిస్తున్న తెగుళ్లు
మిరప తోటలను ఆశిస్తున్న తెగుళ్లతో పూత, కాత రాలుతున్నందున సస్యరక్షణ చర్యలపై అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. 10లో

గరిష్టం / కనిష్టం
32° / 21°
వాతావరణం
జిల్లాలో గురువారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. సాయంత్రం తర్వాత చలి ప్రభావం పెరిగే అవకాశముంది.

న్యూస్‌రీల్

నేడు, రేపు డిప్యూటీ సీఎం పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గురు, శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారు. గురువారం సాయంత్రం 5గంటలకు ఖమ్మం చేరుకోనున్న ఆయన ఆతర్వాత చింతకాని, బోనకల్ మండలాల్లో రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అలాగే, శుక్రవారం పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు.

డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభం



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న ఉద్యోగులు

ఖమ్మం సహకారనగర్: డీఎస్సీ–2008లోఅర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ఖమ్మంలోని డైట్ కళాశాలలో బుధవారం ప్రారంభమైంది. డీఈఓ సోమశేఖరశర్మ, ఐటీడీఏ ఏఓ నారాయణరెడ్డి, ఏటీడబ్ల్యూఓ జహీరుద్దీన్ సర్టిఫికెట్లను పరిశీలించారు. ఏజెన్సీ, మైదాన ప్రాంత అభ్యర్థులకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేయగా ఏజెన్సీ అభ్యర్థుల్లో 215 మందికి 46 మంది, మైదాన ప్రాంత అభ్యర్థులు 128 మందికి 62 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు. విద్యాశాఖ, గిరిజన సంక్షేమ శాఖల ఉద్యోగులు చావా శ్రీనివాసరావు, ఎం.దేవేందర్, ఎర్రమల్ల శ్రీనివాసరావు, కే.వీ.మాధవరావు, రాంబాబు, కే.వీ.రామారావు, జరీనా, అనిత, జి.రమేష్, మార్క్, నారాయణరావు, అజిత, శివకుమారి, రాధాకృష్ణ పాల్గొన్నారు.

జలవనరుల శాఖలో ఇన్‌చార్జ్‌ల నియామకం

ఖమ్మంఅర్బన్: జలవనరుల శాఖలో ఉద్యోగ విరమణ చేసిన అధికారుల స్థానంలో కొత్త వారి నియామకంలో రోజుల తరబడి జాప్యం జరుగుతుంది. గత నెలాఖరున ఖమ్మం, భద్రాచలం, కల్లూరు ఎస్‌ఈలు రిటైర్ అయ్యారు. అయితే, గతంలో ఎవరైనా అధికారి రిటైర్ అయితే అదేరోజు కొత్త వారి నియామకం జరిగేది. కానీ ఈసారి ఆరు రోజులు గడిచినా కొత్త వారిని నియమించకపోగా బుధవారం అక్కడే పనిచేస్తున్న ఇంజనీర్లకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కల్లూరు ఎస్‌ఈగా అక్కడి డీఎస్‌ఈ ఏవీవీఎస్.నర్సింహారావు, కొత్తగూడెం జలవనరుల శాఖ డిప్యూటీ చీఫ్ ఇంజనీర్‌గా టీఎస్‌ఎన్.రవికుమార్‌కు భద్రాచలం ఎస్‌ఈగా అదనపు బాధ్యతలు అప్పగించగా.. ఖమ్మం ఎస్‌ఈగా మాత్రం ఎవరినీ నియమించలేదు. కాగా, ఖాళీల భర్తీలో జాప్యంపై శాఖలో రకరకాలుగా చర్చ జరుగుతోంది.

డయల్ 100కు 4,481 ఫోన్లు

ఖమ్మంక్రైం: అత్యవసర పరిస్థితి ఎదుర్కొంటున్న ప్రజలు సమాచారం ఇచ్చేలా ఏర్పాటుచేసిన డయల్ 100కు అక్టోబర్‌లో 4,481 మంది ఫోన్ చేశారని పోలీసు అధికారులు వెల్లడించారు. ఇందులో 74ఘటనలకు సంబంధించి ఎఫ్‌ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపారు. వీటిలో మహిళలపై వేధింపులు, చోరీలు, ప్రమాదాలు, అనుమానాస్పద మరణాలతో పాటు ఇతర కేసులు ఉన్నాయని పేర్కొన్నారు.

మద్యం డిపోలో నిలిచిన అమ్మకాలు

వైరా: ఉమ్మడి జిల్లాలోని వైన్స్, బార్లకు మద్యం సరఫరా చేసే వైరాలోని ఐఎంఎల్ డిపోలో రెండు రోజులుగా అమ్మకాలు నిలిచిపోయాయి. ఈనెల 4వ తేదిన రూ.4 కోట్ల విలువైన మద్యాన్ని షాపుల నిర్వాహకులు తీసుకెళ్లారు. ఆతర్వాత మంగళ, బుధవారం అమ్మకాలు జరగకపోగా, డిస్టిలరీల నుంచి మద్యం తీసుకొచ్చిన వాహనాలు ఆగిపోయాయి. ఐఎంఎల్‌కు సంబంధించి సర్వర్ పనిచేయకపోవడంతోనే ఈ సమస్య తలెత్తిందని డిపో అధికారులు చెబుతున్నారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వం మద్యం ధరలు పెంచే ఆలోచనలో ఉండగా.. ధరలు ఖరార య్యే వరకు డిపోల నుంచి మద్యం అమ్మకాలు ఆపాలని నిర్ణయించినట్లు ప్రచారం జరుగుతోంది.

ఆర్పీలకు అందని వేతనాలు

ఖమ్మంమయూరిసెంటర్: మెప్మాలో విధులు నిర్వర్తిస్తున్న ఆర్పీలకు సకాలంలో వేతనాలు అందడం లేదు. ప్రభుత్వం ఆర్పీలకు గౌరవ వేతనంగా రూ.6వేలు ఇస్తుండగా.. అవి ఆరు నెలలకోసారి మంజూరవుతాయి. ప్రస్తుతం పెండింగ్ ఉన్న ఆరు నెలల వేతనాల్లో మే నెల వేతనాన్ని విడుదల చేసినా అధికారులు అందించడం లేదనే విమర్శలొస్తున్నాయి. మెప్మాలో సీఓ, టీఎల్‌ఎఫ్, ఆపై స్థాయి అధికారుల తీరుతో ఇలా జరుగుతోందని సమాచారం. ఈ విషయమై అధికారులను వివరణ కోరగా కొత్త పీడీ సంతకాలు బ్యాంక్‌లో మార్చాల్సి ఉందని, రెండు రోజుల్లో వేతనాలు చెల్లిస్తామని తెలిపారు. అయితే, పీడీ బాధ్యతలు స్వీకరించి ఇప్పటికే 70 రోజులు దాటడం గమనార్హం.

రూ.కోట్లు వద్దు.. రూ.లక్షలు చాలు !



ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయం

కాంట్రాక్టర్‌కు జరిమానాలో వింతభాష్యం

- కేఎంసీ అధికారుల నివేదిక బుట్టదాఖలు
- అధికారులనే బాధ్యులుగా చేసేలా ప్రస్తుతం మెమోలు
- నాణ్యత పరిశీలన, రికవరీలో 'విజిలెన్స్' తీరుపై అనుమానాలు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో విజిలెన్స్ విభాగం తనిఖీల తీరు కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా ఉందనే విమర్శలొస్తున్నాయి. గతంలో చేపట్టిన పలు పనుల నాణ్యతను ఇటీవల పరిశీలించిన విజిలెన్స్ బృందం.. కాంట్రాక్టర్‌కు నామమాత్రపు జరిమానా విధించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆయా పనులకు సంబంధించి గతంలో కార్పొరేషన్ అధికారులు ఇచ్చిన నివేదికను పక్కన పడేసి అధికారులనే బాధ్యులుగా చేసేలా ముందుకు సాగుతుండడం గమనార్హం. రూ.1.50 కోట్లను సదరు కాంట్రాక్టర్ నుంచి రికవరీ చేయాలని అధికారులు నివేదిక ఇవ్వగా.. విజిలెన్స్ బృందం మాత్రం రూ.21.42 లక్షలకే పరిమితం చేయడంతో కేఎంసీ పరిధిలో పనుల నాణ్యత పరిశీలన, రికవరీలో విజిలెన్స్ లెక్కలు ఎందుకు తప్పాయా అన్న సందేహాలు వెల్లువెత్తుతున్నాయి.

రికవరీ.. మెమోలు

ఉన్నతాధికారుల నుంచి కాంట్రాక్టర్‌తో పాటు సంబంధిత అధికారులకు మెమోలు జారీ అయ్యాయి. కాంట్రాక్టర్ నుంచి రూ.21,42,385 రికవరీ చేదయమే కాక నాణ్యత లోపించిన రోడ్లను ఆయనతోనే మళ్లీ వేయించాలని సీడీఎంఏ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. అంతేకాక ఆ కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్టులో పెట్టి అప్పటికే కేటాయించి పనులను రద్దు చేయాలని సూచించారు. ఇక గత నెల 10వ తేదీన ఈఎన్‌సీకి విజిలెన్స్ నుంచి నివేదికలు అందగా.. అక్రమాలకు బాధ్యులుగా చేస్తూ పబ్లిక్‌హెల్త్ ఈఎన్‌సీ నుంచి పది మంది అధికారులకు నాలుగు రోజుల క్రితం మెమోలు జారీ చేశారు. అక్రమాలకు ఎందుకు బాధ్యులు కాదో 15 రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని అందులో పేర్కొన్నారు.

విజిలెన్స్ కన్నా ముందే..

విజిలెన్స్ విచారణ కన్నా ముందే ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 'సుడా' నిధులతో జరిగిన అభివృద్ధి పనులపై ప్రభుత్వ ఆదేశాలతో స్థానిక అధికారులు ఈ ఏడాది జనవరి 11న నాణ్యత పరీక్షలు నిర్వహించారు. నాటి కమిషనర్ ఆదర్శ్ సురభి ఆధ్వర్యాన ఇంజనీరింగ్ అధికారులు సీసీ రోడ్ల నుంచి కోర్ కట్ చేసి పరీక్షలకు పంపారు. ఈమేరకు లోపాలు బయటపడగా ఆయా రోడ్లను తిరిగి నిర్మించాలని సూచించడమే కాక కాంట్రాక్టర్‌కు ఇంజనీరింగ్ అధికారులు రూ.1.50 కోట్లకు పైగా జరిమనా విధిస్తూ నోటీసులు ఇచ్చారు. అయితే అప్పటి విచారణ నివేదికలను ప్రస్తుతం పక్కన పెట్టడం గమనార్హం.

అసలేం జరిగిందంటే....

ఖమ్మం నగరంలో 2022–23 ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో అవకతవకలు జరిగాయని ఫిర్యాదులు రావడంతో ఈ ఏడాది ఫిబ్రవరిలో విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. రికార్డులను పరిశీలించడంతోపాటు పలుమార్లు ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో ఎన్నికలకు ముందు 'సుడా' నిధులతో చేపట్టిన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అక్రమాలను గుర్తించినట్లు అప్పట్లో చెప్పారు. మొత్తం ఎనిమిది ప్యాకేజీలకు సంబంధించి రూ.12.81 కోట్ల విలువైన సీసీ, బీటీ రోడ్ల తోపాటు డ్రెయినేజీ నిర్మాణాలను ఒకే కాంట్రాక్టర్‌కు అప్పగించారు. ఈ పనుల్లో కోర్ కటింగ్ ద్వారా నాణ్యత పరిశీలించగా లోపాలు వెల్లడయ్యాయి. దీంతో సదరు కాంట్రాక్టర్‌తోపాటు ఆ సమయాన పనులను పర్యవేక్షించిన అధికారులను బాధ్యులుగా చేస్తూ విజిలెన్స్ అధికారులు ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు.

తగ్గిన జరిమానా..

కార్పొరేషన్ అధికారులు వేసిన జరిమానాను విజిలెన్స్ బృందం పక్కన పెట్టినట్లు తెలిసింది. ఇంజనీరింగ్ అధికారులు రూ.1.50కోట్ల మేర జరిమానా విధిస్తే విజిలెన్స్ అధికారులు మరోమారు విచారణ చేపట్టి దాన్ని రూ.21.42 లక్షలకు కుదించడంపై చర్చ జరుగుతోంది. రూ.12.81 కోట్ల విలువైన పనుల్లో భారీగా అక్రమాలు జరిగాయని ఆరోపణలు రావడం, పరీక్షల్లోనూ నాణ్యత లోపం బయటపడడంతో కార్పొరేషన్ అధికారులు ఎక్కువ మొత్తంలో జరిమానా విధిస్తే విజిలెన్స్ అధికారులు తగ్గించడం అధికార, రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది.

అధికారులే సూత్రధారులట..

గత ప్రభుత్వ హయాంలో జరిగిన పనులపై కాంగ్రెస్ ప్రభుత్వం విచారణ చేయిస్తున్న నేపథ్యాన విజిలెన్స్ నివేదిక నాటి అధికారులను ప్రధాన బాధ్యులుగా చేయడం గమనార్హం. కేఎంసీ పరిధిలో సుడా నిధులతో జరిగిన పనులను పర్యవేక్షించిన నాటి అధికారులు పది మందికి మెమోలు జారీ చేయడంతో వారంతా ఇప్పుడు గగ్గోలు పెడుతున్నారు. మెమోలు అందుకున్న వారు సమాధానాలు ఇచ్చాక మళ్లీ విచారణ ఉంటుందని, అప్పటివరకు పదోన్నతులు, ఇంక్రిమెంట్లు నిలిచిపోతాయని ఆందోళన చెందుతున్నారు. ఏదిఏమైనా అధికారులనే సూత్రధారులుగా చేయడం, కాంట్రాక్టర్‌కు జరిమానా తగ్గించిన అంశంపై ఉన్నతాధికారులను కలవాలని నిర్ణయించినట్లు తెలిసింది.

ఇందిరా డెయిరీలో మౌలిక వసతులు

- డిసెంబర్ నాటికి 250 యూనిట్ల గ్రౌండింగ్
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



ముదిగొండలో స్థల పరిశీలన చేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం సహకారనగర్: మధిర అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఏర్పాటుచేస్తున్న ఇందిరా మహిళా డెయిరీలో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆయన డెయిరీ నిర్వహణ, పాల సేకరణ కేంద్రాలు, కొత్త యూనిట్ల ఏర్పాటు, మహిళా సంఘాల గ్రేడింగ్‌పై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండలాల వారీగా ఏయే గ్రామాల్లో పాల సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేయాలో నిర్ధారించాలని తెలిపారు. పాల ఉత్పత్తిలో ఉన్న కుటుంబాలను గుర్తించి మండలానికి 50చొప్పున యూనిట్లను డిసెంబర్ నాటికి గ్రౌండింగ్ చేయాలని సూచించారు. తక్కువ పశువులు ఉన్న కుటుంబాలకు రెండు చొప్పున గేదెలు పంపిణీ చేయాలన్నారు. కాగా, మహిళా శక్తి కార్యక్రమ అమలుకు మహిళా సంఘాల సమావేశాలు తప్పనిసరిగా జరిగేలా పర్యవేక్షించాలని సూచించారు. ఈ విషయమై ముదిగొండ, వైరా, రఘునాథపాలెం తదితర మండలాలలో గ్రేడింగ్ పెరగగా, మధిర, చింతకాని మండలాల్లో యూనిట్ గ్రౌండింగ్ పురోగతి బాగుందని తెలిపారు. ఇక ఐకేపీ ద్వారా సన్న రకం ధాన్యం కొనుగోళ్లపై శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, డీఆర్డీవో సన్యాసయ్య తదితరులు పాల్గొన్నారు.

డెయిరీ స్థల పరిశీలన

ముదిగొండ: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద ఇందిరా డెయిరీ భవన నిర్మాణానికి స్థలాన్ని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ బుధవారం పరిశీలించారు. గత మూడు నెలలుగా వాయిదా వేస్తున్న అధికారులను మందలించిన ఆయన ప్రధాన రహదారికి దగ్గరలో పాత భవనాన్ని తొలగించి నూతన నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. ఆతర్వాత కులగణన సర్వేపై సూచనలు చేసిన కలెక్టర్, శిథిలావస్థలో ఉన్న శాఖ గ్రంథాలయాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. డీఆర్‌డీఓ ఆర్.సన్యాసయ్య, తహసీల్దార్ సునీత, ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు కృషి చేయాలి

ఖమ్మంరూరల్: విద్యార్థి దశలోనే లక్ష్యాలను ఎంచుకుని వాటిని చేరుకునేలా నిరంతరం శ్రమించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. ఖమ్మం రూరల్ మండలంలోని జలగంనగర్‌లోని ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన ఆయన ఆరో తరగతి విద్యార్థులకు గణితం పాఠాలు బోధించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నిర్దేశించుకున్న లక్ష్యాన్ని డైరీలో రాసుకుని ప్రతిరోజు దాన్ని చేరేందుకు ఎంత కష్టపడ్డామో గుర్తు చేసుకోవాలన్నారు. చదువుతో పాటు ఆటల్లోనూ ముందుండాలని సూచించారు. ఆతర్వాత అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా రూ.8లక్షలతో చేపట్టిన పనులను పరిశీలించి విద్యుత్ సంబంధిత పనుల కోసం రూ.50వేలు చెక్కును హెచ్‌ఎం శ్యాంసన్‌కు అందించారు.

సమగ్ర సర్వే ప్రారంభం

- తొలి రోజు 70.08శాతం ఇళ్ల గుర్తింపు
- నేటితో గుర్తింపు పూర్తి.. రేపటి నుంచి సర్వే మొదలు



ఉద్యోగులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం సహకారనగర్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా ఇళ్ల గుర్తింపు ప్రక్రియ బుధవారం మొదలైంది. బోనకల్, ఖమ్మం రూరల్, ముదిగొండ మండలాలతో పాటు ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పరిశీలించారు. ఇళ్ల గుర్తింపు గురువారం పూర్తికానుండగా, శుక్రవారం నుంచి వివరాల సేకరణ మొదలుపెడతారు. కాగా, జిల్లాలోని 5,36,335 గృహాలకు గాను తొలిరోజు 3,75,873ఇళ్ల(70.08శాతం)ను గుర్తించారు. ఇందులో పట్టణ ప్రాంతాల్లో 2,02,941, గ్రామీణ ప్రాంతాల్లో 3,33,394 గృహాలు ఉన్నాయని అధికారులు వెల్లడించారు.

ప్రణాళికల రూపకల్పనకే సర్వే

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రణాళికల రూపకల్పన చేసేందుకే ఇంటింటి సర్వే చేపడుతోందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. ఖమ్మం 53వ డివిజన్ ద్వారకానగర్‌లో చేపట్టిన ఎన్యూమరేషన్ బ్లాక్‌ల గుర్తింపును బుధవారం ఆయన పరిశీలించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ప్రతీ 150 ఇళ్లకు ఒక ఎన్యూమరేషన్ బ్లాక్ చొప్పున 3,300 బ్లాక్‌లను గుర్తించామని, ఇళ్ల లెక్క తేలాక అదనపు బ్లాక్‌లు కేటాయిస్తామని తెలిపారు. ఇదేసమయంలో స్టిక్కర్ వేయని ఇళ్ల విషయమై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. సమగ్ర సర్వేతో ప్రస్తుతం అందుతున్నవి, భవిష్యత్‌లో అమలయ్యే పథకాలు కానీ ఆగిపోతాయనే అపోహలు పెట్టుకోవద్దని సూచించారు. ఇందులో భాగంగా స్వచ్ఛందంగా చెప్పే వారి నుంచే వివరాలు తీసుకుంటారు తప్ప బలవంతం చేయబోరని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, అసిస్టెంట్ కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ఠ, కార్మిక శాఖ సహాయ కమిషనర్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

త్యాగాలు, పోరాటాల సమ్మిళితమే సీపీఐ

- విస్తరణే లక్ష్యంగా వందేళ్ల సంబురం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు



సీపీఐ జిల్లా కౌన్సిల్‌లో మాట్లాడుతున్న కూనంనేని, పక్కన నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) త్యాగాలు, పోరాటాలకు మారుపేరుగా నిలిచిందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. నిర్బంధాలు ఎదురైనా అధిగమిస్తూ ఎదిగిన పార్టీ నీడన రాష్ట్రంలో లక్ష కుటుంబాలు ఉన్నాయని వెల్లడించారు. సీపీఐ జిల్లా కౌన్సిల్ సమావేశం బుధవారం పగడాల మల్లేష్ అధ్యక్షతన ఖమ్మంలోని గిరిప్రసాద్ భవన్‌లో జరగగా ముఖ్యఅతిథిగా కూనంనేని మాట్లాడారు. సీపీఐ ఆవిర్భావంలో నిర్బంధాలు ఎదురైనా స్వాతంత్య్ర పోరాటంలోనూ పార్టీ నాయకులు పాల్గొన్నారని గుర్తుచేశారు. జమీందారులు, జాగీర్దారీ వ్యవస్థ పోయి పేదలకు భూమి దక్కడం నేతల పోరాట ఫలితమేనన్నారు. వచ్చేనెల 26 నుండి జరగనున్న వందేళ్ల సంబురంలో పార్టీ విస్తరణే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. మారిన రాజకీయ పరిస్థితులు, పాలకుల తీరు కమ్యూనిస్టుల అవసరాన్ని గుర్తుచేస్తుండగా, ప్రజల అవసరాలకు అనుగుణంగా పార్టీని విస్తరిస్తామని వెల్లడించారు. ఖమ్మం జిల్లాలో ప్రతి ఇంటికి ఉద్యమ చరిత్ర ఉన్నందున ఈ చరిత్రను నేటి తరానికి చెప్పడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలని సూచించారు. కాగా, దేశంలో బీజేపీ పాలనలో మంచి జరుగకపోగా ఆర్థిక అంతరాలు పెరిగాయని, ఆ పార్టీ మత ప్రాతిపదికనే కార్యకలాపాలు చేపడుతోందని విమర్శించారు. సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ మాట్లాడగా నాయకులు దండి సురేష్, మహ్మద్ మౌలానా, ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

● **ఖమ్మంరూరల్:** ఎర్రజెండా విడవకుండా తుది శ్వాస వరకు ఎర్రబోయిన మల్లయ్య కమ్యూనిస్టుగానే కొనసాగారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఖమ్మం రూరల్ మండలం కాచిరాజుగూడెంలో జరిగిన ఎర్రయ్య సంస్మరణ సభలో పాల్గొని ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించాక మాట్లాడారు. నాయకులు ఎం.డీ.మౌలానా, దండి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందుతోందా?



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న డీపీఓ ఆశాలత, అధికారులు

తల్లాడ: జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) ఆశాలత బుధవారం తల్లాడ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ప్రతీ బుధవారం జిల్లా స్థాయి అధికారులు పాఠశాలల్లో తనిఖీ చేయాలన్న కలెక్టర్ ఆదేశాలతో ఆమె వచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేసిన డీపీఓ మెనూ ప్రకారం భోజనం అందుతోందా, పాఠాలు అర్థమవుతున్నాయా, అసౌకర్యాలు ఉన్నాయా అని తెలుసుకున్నారు. ఆతర్వాత మరుగుదొడ్లను పరిశీలించి నిర్వహణకు సూచనలు చేశారు. అనంతరం మల్లవరం గ్రామపంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన డీపీఓ పన్నుల వసూళ్లు, పారిశుద్ధ్య పనులపై ఆరాతీశారు. ఎంపీఓ కె.శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి కృష్ణారావు పాల్గొన్నారు.

కూల్చాలా.. కుదించాలా?!

- మున్నేరు ముంపునకు ప్రకాశ్‌నగర్ చెక్‌డ్యామే కారణమని నిర్ధారణ
- చెక్‌డ్యామ్ తొలగింపునకు ఉన్నతాధికారుల నిర్ణయం
- ప్రభుత్వ ఆమోదం కోసం ఎదురుచూపులు
- రిటైనింగ్ వాల్స్ నిర్మాణం యథావిధిగానే...



మున్నేరుపై ప్రకాష్‌నగర్ హైలెవల్ బ్రిడ్జి సమీపాన చెక్ డ్యామ్ మీదుగా నీటి ప్రవాహం

ఖమ్మంఅర్బన్: మున్నేటికి సెప్టెంబర్ మొదటి వారంలో వచ్చిన వరద ఖమ్మం నగరాన్ని ముంచెత్తింది. అయితే, ఈ ముంపునకు ప్రకాశ్‌నగర్ వద్ద మున్నేటిలో హైలెవల్ వంతెనను ఆనుకుని మూడేళ్ల క్రితం రూ.7.30 కోట్లతో నిర్మించిన చెక్‌డ్యామే కారణమని భావిస్తున్నారు. ఈ విషయమై అధికారులు ఇచ్చిన నివేదికతో సీఈ సీడీఓ(చీఫ్ ఇంజనీర్ సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్) నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. దీంతో ప్రభుత్వం ఆమోదిస్తే చెక్‌డ్యామ్ కూల్చివేయాలనే భావనకు వచ్చినట్లు సమాచారం. లేదంటే ఎత్తు తగ్గించాలనే మరో ప్రతిపాదన కూడా ఉందని జలవనరుల శాఖ వర్గాల ద్వారా తెలిసింది.

ఊహించిన రీతితో వరద

రెండు నెలలు క్రితం భారీ వర్షంతో మున్నేటిలోకి వచ్చిన వరద ఖమ్మం నగరంతో పాటు ఖమ్మం రూరల్ మండలంలోని పలు ప్రాంతాలను ముంచెత్తిన విషయం విదితమే. ఈ కారణంగా వేలాది ఇండ్లు మునిగిపోయి ప్రజలు కట్టుబట్టలతో మిగిలారు. రూ.కోట్ల విలువైన ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులకు నష్టం ఏర్పడింది. ఎగువ ప్రాంతాల్లో ఊహించని రీతిలో వర్షం కురవడమే ఈ వరదకు కారణమని ఇన్నాళ్లు భావిస్తుండగా ఇప్పుడు మాత్రం ప్రకాశ్‌నగర్ వంతెన సమీపాన సుమారు 11 అడుగుల ఎత్తుతో నిర్మించిన చెక్ డ్యామ్‌ను కారణంగానే చెబుతున్నారు. వరద కారణాలు, ఈ సమయాన జరిగిన నష్టంపై సీఈ సీడీఓకు ఇంజనీర్లు ఇచ్చిన నివేదిక ఆధారంగా ఈ భావనకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈమేరకు చెక్‌డ్యామ్ తొలగిస్తే పూర్తిగా ముప్పు తొలగిపోతుందని, లేదంటే ప్రస్తుతం ఉన్న ఎత్తులో సగమైనా తొలగిస్తే మంచిదని చర్చించినట్లు సమాచారం. దీంతో సీఈ సీడీఓ ఇచ్చిన నివేదిక ఆధారంగా ప్రభుత్వం తీసుకునే నిర్ణయం కోసం వేచి చూస్తున్నారు.

పాత డిజైన్‌తోనే రిటైనింగ్ వాల్స్

మున్నేటి వరద పరీవాహక ప్రాంతాన్ని ముంచెత్తకుండా ఇరువైపులా 17 కి.మీ. మేర రిటైనింగ్ వాల్స్ నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో రూ.690 కోట్ల అంచనాలతో పనులు ప్రారంభించారు. ఈ పనులు మొదలుపెట్టిన రెండు నెలలకే భారీ వరద రావడంతో డిజైన్‌పై పునరాలోచనలో పడ్డారు. గతంలో రూపొందించిన డిజైన్ ప్రకారం నిర్మిస్తే ఇలాంటి వరద మళ్లీ వస్తే పరిస్థితి ఏమిటనే ప్రశ్న తలెత్తింది. ఈఅంశంపై ఉన్నతస్థాయి అధికారులు, నిపుణులు కసరత్తు చేశారు. పాత డిజైన్ ప్రకారం కాకుండా మరికొంత ఎత్తు పెంచి వాల్స్ నిర్మించాలనే ఆలోచన చేసినట్లు తెలిసింది. కానీ ఇందుకు వ్యయం రెట్టింపవుతుందని గుర్తించినట్లు సమాచారం. అయితే, పూర్తిస్థాయిలో నివేదికలు పరిశీలించాక పాత డిజైన్‌లో ప్రకారం మున్నేరుకు 3.50 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చినా ముంపు ఉండదని.. సెప్టెంబర్‌లో 3.15 లక్షల క్యూసెక్కుల మేర వరద మాత్రమే వచ్చినందున పాత డిజైన్‌తోనే నిర్మాణం కొనసాగించాలని నిర్ణయించినట్లు అధికారిక వర్గాల ద్వారా తెలిసింది. ఇదే సమయాన ప్రకాష్‌నగర్ వద్ద హైలెవల్ వంతెనను ఆనుకుని నిర్మించిన చెక్‌డ్యామ్‌ను పూర్తిగా తొలగించడమా లేదంటే ఎత్తు తగ్గించడమా అన్న అంశంపై నిర్ణయం తీసుకుంటే సరిపోతుందనే భావనకు వచ్చినట్లు సమాచారం.

ప్రభుత్వ కేంద్రాల్లోనే బోనస్



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాయల

ముదిగొండ: సన్నధాన్యం సాగుచేసిన రైతులు ప్రభుత్వ కేంద్రాల్లో అమ్మితేనే క్వింటాకు రూ.500 బోనస్ లభిస్తుందని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని వనంవారి కిష్టాపురం, కమలాపురం, గోకినపల్లి, మేడేపల్లి, కట్టకూరుల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ప్రారంభించి మాట్లాడారు. మునుపెన్నడూ లేని విధంగా ప్రభుత్వం సన్నరకాలకు బోనస్ ప్రకటించిందని తెలిపారు. ఈ మేరకు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కేంద్రాలకు రావాలన్నారు. కాగా, కేంద్రాల్లో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించి తేమ, తాలు పేరిట కొర్రీలు పెట్టకుండా కొనుగోళ్లు చేయాలని నిర్వాహకులకు సూచించారు. సొసైటీ చైర్మన్ యలగొండ స్వామి, డైరెక్టర్ వనం ప్రదీప్తబాబు, కాంగ్రెస్ జిల్లా, మండల అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కొమ్మినేని రమేష్‌బాబుతో పాటు ఆదినారాయణరెడ్డి, ఇలవల పుల్లారెడ్డి, వాక వెంకటేశ్వరెడ్డి, ఉద్యోగులు అంజయ్య, బాబు రాంరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాతీయస్థాయి పోటీలకు ఖమ్మం ఆర్చర్లు



క్రీడాకారులను అభినందిస్తున్న డీవైఎస్‌ఓ, కోచ్

ఖమ్మంస్పోర్ట్స్: మహబూబాబాద్ జిల్లాలోని నెల్లికుదురులో జరిగిన రాష్ట్రస్థాయి పాఠశాలల అండర్–14 ఆర్చరీ పోటీల్లో ఖమ్మం క్రీడాకారులు టి.వెంకటయోగేశ్వర్, షేక్ హసన్న ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 19 నుంచి 20 తేదీల్లో గుజరాత్ రాష్ట్రం నడియాడ్‌లో జరిగే పోటీల్లో వీరు తెలంగాణ తరఫున పాల్గొంటారు. కాగా, ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలోని ఖేలో ఇండియా సెంటర్‌లో శిక్షణ పొందుతున్న వెంకట యోగేశ్వర్, హసన్నా రాష్ట్రస్థాయి పోటీల్లో మొదటి రెండు స్థానాల్లో నిలిచారు. క్రీడాకారులను డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, కోచ్ పాయం నగేశ్ బుధవారం అభినందించారు.

వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శిగా శ్రీనివాసరావు



వి.శ్రీనివాసరావు

ఖమ్మంస్పోర్ట్స్: వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శిగా వి.శ్రీనివాసరావును నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు పగడాల నాగరాజు తెలిపారు. ఇప్పటి వరకు ఈ పదవిలో కొనసాగిన శివగణేశ్‌ను తొలగించి శ్రీనివాసరావుకు బాధ్యతలు అప్పగించినట్లు వెల్లడించారు. రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్‌లో నెలకొన్న విభేదాలే ఇందుకు కారణమని సమాచారం. అయితే, శివగణేశ్ లావాదేవీలు సక్రమంగా నిర్వర్తించక పోగా మరో అసోసియేషన్ ఏర్పాటు చేశాడనే సమాచారంతో ఆయనను తొలగించినట్లు తెలిపారు. కాగా, 2025లో ఎన్నికలు జరిగే వరకు ఈ పదవిలో శ్రీనివాసరావు కొనసాగుతారని వెల్లడించారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



రికార్డులు పరిశీలిస్తున్న అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు

కొణిజర్ల: కొణిజర్ల పోలీస్‌స్టేషన్‌ను అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు బుధవారం సాయంత్రం సందర్శించారు. స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పని తీరు, కేసుల దర్యాప్తు వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని సూచించారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా సీసీ కెమెరాల ఏర్పాటుపై స్థానికులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఎస్‌ఐ జి.సూరజ్, సిబ్బంది పాల్గొన్నారు.

లారీ – కారు ఢీ.. తప్పిన ప్రమాదం

బోనకల్: మండలంలోని ముష్టికుంట్ల సమీపాన ఖమ్మం – బోనకల్ ప్రధాన రహదారిపై బుధవారం లారీ – కారు ఢీకొన్నాయి. ఖమ్మం నుంచి బోనకల్ వెళ్తున్న లారీ, బోనకల్ నుంచి ఖమ్మం వెళ్తున్న కారును ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు ముందు భాగం నుజ్జునుజ్జు కాగా ఎయిర్ బ్యాగ్‌లు తెరుచుకోవడంతో అందులో ఉన్న వారు ప్రమాదం నుంచి బయటపడ్డారు. కాగా, కారును ఢీకొట్టిన లారీ ప్రధాన రహదారిపై బోల్తా పడగా కారు, డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనలో ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోగా పోలీసులు చేరుకుని క్రేన్ సాయంతో తీయించి రాకపోకలను క్రమబద్ధీకరించారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి

కూసుమంచి: మండలంలోని ఈశ్వరమాధారం విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపాన బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. రాజుపేటకు చెందిన భూక్యా చిరంజీవి (55) తన ద్విచక్రవాహనంపై నాయకన్‌గూడెం నుంచి ఇంటికి వెళ్తుండగా సబ్‌స్టేషన్ సమీపాన వాహనం అదుపుతప్పి పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆయనను 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. చిరంజీవికి భార్య, ఇద్దరు పిల్లలు ఉండగా, ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,250	6,500
మిర్చి	16,299	8,000
మిర్చి తాలు	8,500	6,000
ఏసీ మిర్చి	18,000	9,000
ఏసీ తాలు	9,000	8,500
పత్తి	6,800	5,800

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.19,144



మధిరలో చిన్నారులకు పాఠం చెబుతున్న అంగన్‌వాడీ టీచర్

వేతన వెతలు..

జీతం, ఇతర అంశాల్లో అంగన్‌వాడీల ఎదురుచూపులు

- మినీ అంగన్‌వాడీ టీచర్లకు పెరిగినా చేతికి రాని వైనం
- ఏడు నెలలుగా అందని అద్దె బకాయిలు
- ఫలితంగా సామగ్రి, అద్దెకు సొంత నగదు వెచ్చించాల్సిన పరిస్థితి
- రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కోసమూ ఎదురుచూపులే

మధిర: అంగన్‌వాడీ మినీ కేంద్రాల్లో వంట పని చేసి పిల్లల బాగోగులు చూస్తూనే విద్యాబుద్ధులు నేర్పించడం.. ఆపై సమావేశాలకు హాజరు, వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు, రికార్డుల నిర్వహణ ఇలా రకరకాల పనులతో టీచర్లు ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. మినీ అంగన్‌వాడీల్లో హెల్పర్లు లేకపోవడంతో ఈ పనులన్నీ టీచర్లు చేసుకోవాల్సిందే. అయితే, ఇంత పని చేస్తున్నా సక్రమంగా వేతనాలు అందక.. సామగ్రి ఖర్చులు రాక, అద్దె బిల్లులు సైతం విడుదల కాకపోవడంతో అన్ని ఖర్చులు సొంతంగా భరించాల్సి వస్తుండటంతో మానసిక క్షోభ అనుభవిస్తున్నామని వాపోతున్నారు.

అప్‌గ్రేడ్ టీచర్ల ఇబ్బందులు..

మినీ అంగన్‌వాడీలను మెయిన్ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేసిన ప్రభుత్వం టీచర్లను సైతం అప్‌గ్రేడ్ చేసింది. దీంతో గతంలో నెలకు రూ.7,800 అందిన వేతనం రూ.13,650కి పెరిగింది. రెండు నెలల పాటు కొత్త జీతం ఇచ్చినా.. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి మళ్లీ పాత జీతం రూ.7,800 మాత్రమే ఇస్తున్నారు. దీనికి తోడు భవనాల అద్దె రాకపోవడంతో సొంత డబ్బులు చెల్లించాల్సి వస్తోంది. ఆపై కూరగాయలకు, గ్యాస్ సిలిండర్ బిల్లులు మూడు లేదా ఆరు నెలలకోసారి వస్తుండటంతో అప్పటివరకు సొంతంగానే ఖర్చు పెట్టాల్సి వస్తోంది. ఇక అప్‌గ్రేడ్ అయిన మినీ కేంద్రాల్లో హెల్పర్లను నియమించకపోగా అన్ని పనులు టీచర్లే చేయాల్సి వస్తోంది.

ఉద్యోగ విరమణ పొందిన వారి కష్టాలు..

ప్రభుత్వం 65 ఏళ్లు నిండిన అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు విరమణ ప్రకటించింది. ఈమేరకు టీచర్లకు రూ.లక్ష, హెల్పర్‌కు రూ.50 వేలు చెల్లిస్తామని చెప్పింది. కానీ ఏ ఒక్కరికి బెనిఫిట్స్ మంజూరు కాలేదు. రెండు, మూడు దశాబ్దాలుగా పనిచేస్తున్న వీరిని అర్ధంతరంగా తొలగించడం.. బెనిఫిట్స్ కూడా చెల్లించకపోవడంతో పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది.

ఏడు నెలలుగా అందని అద్దె

జిల్లాలో 239 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఇటీవల అప్‌గ్రేడ్ అయ్యాయి. దీంతో మొత్తం 1,840 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. వీటిలో 958 కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నాయి. మరో 448 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతుండగా, ఇంకా 434 కేంద్రాలు ఉచిత భవనాల్లో నిర్వహిస్తున్నారు. కాగా, అద్దె భవనాలకు ఈ ఏడాది ఫిబ్రవరి తర్వాత అద్దె రాకపోవడంతో యజమానుల ఒత్తిడితో టీచర్లే సొంతంగా చెల్లిస్తున్నారు.



ఏడు నెలలుగా అద్దె మంజూరు కాని అంగన్‌వాడీ కేంద్రం

పెరిగిన వేతనం చెల్లించాలి..



మినీ అంగన్వాడీ టీచర్లను అప్‌గ్రేడ్ చేసి రెండు నెలలు పెరిగిన జీతం ఇచ్చినా మళ్లీ పాత లెక్క ప్రకారమే ఇస్తున్నారు. ఆరు నెలలుగా పెరిగిన వేతనం మంజూరు కాలేదు. హెల్పర్ లేక వంట పనికి తోడు రికార్డుల నిర్వహణ, ఆన్‌లైన్ నమోదు చేయాల్సి వస్తోంది.

–ప్రశాంతి, ఆర్‌సీఎం చర్చి అంగన్‌వాడీ కేంద్రం, మధిర

మేము ఎలా బతకాలి..



65 ఏళ్లు నిండిన టీచర్లు, హెల్పర్లను నోటిమాటతో వెళ్లిపొమ్మన్నారు. రూ.లక్ష ఇస్తామని చెప్పి ఇప్పుడు రూ.50 వేలు అంటున్నారు. కానీ, ఆ నగదు ఇప్పటి వరకు అందలేదు. నాకు ఎవరూ దిక్కులేరు. సమయం కూడా ఇవ్వకుండా వెళ్లమనడంతో ఎలా బతకాలి?

–చెన్నం అంజమ్మ, రిటైర్డ్ అంగన్‌వాడీ హెల్పర్, మధిర

ప్రభుత్వం దృష్టిలో ఉంది..



అద్దె భవనాలకు త్వరలోనే బకాయిలు మంజూరు అవుతాయి. అప్‌గ్రేడ్ అయిన టీచర్ల వేతనాల పెంపు విషయం ప్రభుత్వం దృష్టిలో ఉంది. ఇది అమలు కావాల్సి ఉంది. ఖాళీ పోస్టుల భర్తీకి సంబంధించి ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తాం.

–రాంగోపాల్‌రెడ్డి, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్, ఖమ్మం

మిరప తోటలను ఆశిస్తున్న తెగుళ్లు

- కొమ్మకుళ్లు తెగులుతో రాలిపోతున్న పూత, కాత
- మరోపక్క ప్రమాదకరంగా మారిన వేరుకుళ్లు
- సస్యరక్షణ చర్యలపై జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి సూచనలు



కొమ్మకుళ్లు తెగులుతో ఎండుతున్న మిర్చి కొమ్మలు



కామేపల్లి మండలం కొత్త లింగాలలో తెగులు సోకిన తోటలో పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్

ఖమ్మంవ్యవసాయం: మిర్చి తోటలు వేసి రెండు నెలలు దాటుతుండగా.. కొద్దిరోజులుగా తెగుళ్ల బారిన పడుతున్నాయి. గడిచిన మూడేళ్ల పాటు తామర పురుగు(నల్లి) మిర్చి తోటలను దెబ్బతీసింది. ఈ ఏడాది ఇప్పటి వరకు తామర పురుగు సమస్య కనిపించలేదు. కానీ ఇప్పుడు పూత, కాత దశలో ఉన్న తోటలను కొమ్మకుళ్లు, వేరుకుళ్లు తెగులు ఆశిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. ఒకే భూమిలో ఏటా మిర్చి సాగు చేస్తే వేరుకుళ్లు, కొమ్మకుళ్లు తెగుళ్లు ఆశిస్తాయని ఉద్యాన నిపుణులు చెబుతున్నారు. బ్యాక్టీరియా, శిలీంద్రాలు భూమిలో ఉండి కొమ్మకుళ్లు, వేరుకుళ్లు (ఎండు తెగులు), కాయకుళ్లు తెగుళ్లు ఆశిస్తాయని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి ఎంవీ మధుసూదన్ తెలిపారు. ఈ మేరకు తెగుళ్ల నివారణకు రైతులు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు, సమగ్ర సస్య రక్షణ చర్యలను ఆయన వివరించారు.

కొమ్మ ఎండు తెగులు

ఈ తెగులు మొదట లేత కొమ్మలు, పూతను ఆశించి పూత రాలిపోతుంది. కొమ్మలు చివర్ల నుంచి కిందికి ఎండుతాయి. పండు కాయలపైనా నల్లటి మచ్చలు ఏర్పడి కుళ్లి రాలిపోతాయి. మిగిలినవి తాలుగా మారతాయి. దీని నివారణకు లీటర్ నీటిలో 1.5 కాప్టాన్ లేదా 2.5 గ్రాముల మాంకోజెబ్ లేదా 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 1 మి.లీ. ప్రోఫికోనజల్ లేదా కోనజల్ లేదా 1 గ్రాము అజాక్స్ ట్రోబిన్ లేదా 1 గ్రాము ప్లాంటోమైసిన్ కలిపి పది రోజుల వ్యవధిలో రెండు – మూడు సార్లు పూర్తిగా తడిచేలా పిచికారీ చేయాలి.

ఎండుతెగులు

భూమిలో ఉండే శిలీంధ్రం ద్వారా ఈ తెగులు ఆశించి మొక్కలు ఎండిపోతాయి. ఇది వేరు నుంచి వ్యాపిస్తుంది. అందుకే దీన్ని వేరుకుళ్లు తెగులు అని కూడా పిలుస్తారు. దీని నివారణకు పంట మార్పిడి విధానం ఉపకరిస్తుంది. వేసవిలో లోతు దుక్కులు చేసుకోవాలి. తెగులు వ్యాప్తిని అరికట్టడానికి కాల్వల ద్వారా నీరు పెట్టడం తగ్గించి డ్రిప్ పద్ధతిలో అందించాలి. తెగుళ్ల నివారణకు లీటర్ నీటిలో మూడు గ్రాముల చొప్పున కాపర్ ఆక్సీ క్లోరైడ్ కలిపి మొక్కల మొదళ్లలో పోయాలి. అనంతరం నాలుగు రోజులకు నీరు కట్టాలి. ఎకరాకు రెండు కిలోల ట్రైకోడెర్మా ఫార్ములేషన్‌ను 90కిలోల పశువుల ఎరువు, 10 కిలోల వేపపిండి మిశ్రమాన్ని కలిపి వేయాలి.

రేపటి నుంచి ఆళ్వార్ల ప్రవచనాలు



మాట్లాడుతున్న కోదండరామాచార్యులు, పక్కన రాఘవాచార్యులు తదితరులు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం బైపాస్‌రోడ్డులోని ఎన్నెస్పీ క్యాంపులో ఉన్న శ్రీసీతారామాంజనేయ స్వామి దేవాలయంలో ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు ద్వాదశ సూరుల (ఆళ్వార్లు)చే వైభవ ప్రవచనాలు నిర్వహిస్తున్నట్లు వేదావధాని, శ్రీ పాంచరాత్రాంగమ శాస్త్ర విద్వన్మణి డాక్టర్ కండ్లకుంట్ల కోదండరామాచార్యులు, శ్రీ వైష్ణవ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు వేదాంతం రాఘవాచార్యులు తెలిపారు. ఆలయంలో బుధవారం వారు మాట్లాడుతూ 12 మంది ఆళ్వార్లు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని వెల్లండించారు. ప్రతినిత్యం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, సాయంత్రం 6 నుంచి 7.30 గంటల వరకు ప్రవచనాలు ఉంటాయని తెలిపారు. సమావేశంలో శ్రీ వైష్ణవ సేవా సంఘం బాధ్యులు ఎస్‌పీహెచ్ ప్రసాదాచార్యులు, కె.లక్ష్మీనరసింహన్, శ్రీనివాస్ కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

భద్రాద్రి రామయ్యకు కవచాలు బహూకరణ



స్వామివారికి సమర్పించిన కవచాలు

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి బంగారం పూతతో కూడిన రాగి కవచాలను భక్తుడు అందజేశారని ఆలయ ఈఓ బి.రమాదేవి తెలిపారు. ఏపీలోని విజయనగరం జిల్లాకు చెందిన సత్యనారాయమూర్తి – వెంకటరత్నశ్రీ దంపతులు గతంలో స్వామిని దర్శించుకున్న సమయాన ఏమైనా సమర్పించాలనే ఆలోచనలో ఉన్నట్లు చెప్పారన్నారు. ఈ మేరకు అర్చకుల సూచనలతో రాగితో చేయించి బంగారు పూత, రత్నాలతో పొదిగిన రూ.3.10 లక్షల విలువైన కవచాలు, ఆయుధాలను సమర్పించారని తెలిపారు. ఈ కవచాలను ఉత్సవమూర్తులకు నిత్యకల్యాణం సమయాన అలంకరించనున్నట్లు ఈఓ వెల్లడించారు.

- భద్రాచలంఅర్బన్: శ్రీ సీతారామచంద్ర స్వామికి విజయవాడలోని మాచవరానికి చెందిన భాస్కరం బంగారపు ముత్యాల దండతో పాటు గొలుసు అందజేశారు. వీటి విలువ రూ.1.39లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు.

నేడు హుండీ ఆదాయం లెక్కింపు

శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలోని హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించనున్నట్లు ఈఓ బి.రమాదేవి తెలిపారు. ఉదయం 10 గంటలకు లెక్కింపు మొదలవుతుందని, ఆలయ ఉద్యోగులతో పాటు స్వచ్ఛంద సంస్థల సభ్యులు, భక్తులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

మలేసియాలో ఖమ్మం కీర్తి!

కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చిన మాన్వి



జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందుకుంటున్న మాన్వి

ఖమ్మంఅర్బన్: మలేసియాలోని కౌలాలంపూర్ నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఇండియన్ కల్చరల్ సెంటర్‌లో ఈ నెల 4 నుంచి కల్పశ్రీ కళాపీఠం, నృత్యకళల సంస్థ ఆధ్వర్యాన అంతర్జాతీయ సాంస్కృతిక ఉత్సవాలు జరుగుతున్నాయి. ఇందులో ఖమ్మానికి చెందిన చిన్నారి గుత్తికొండ మాన్వి కూచిపూడి నాట్యప్రదర్శన ఇచ్చింది. గతంలోనూ పలు దేశాల్లో ప్రదర్శనలు ఇచ్చిన ఆమె.. కౌలాంపూర్‌లో ప్రదర్శనతో ఆకట్టుకోగా సెంటర్ డైరెక్టర్ విజయలక్ష్మి సుందరరాజన్ ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు. కాగా, మాన్వి కె.లక్ష్మీనారాయణ వద్ద శిక్షణ పొందుతోందని తల్లిదండ్రులు డాక్టర్ వెంకటేశ్వరరావు–డాక్టర్ అనితారావు తెలిపారు.

ఈఎంఆర్‌ఐలో ఉద్యోగాలకు నేడు ఇంటర్వ్యూలు

తల్లాడ: ఈఎంఆర్‌ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ సంస్థ పరిధిలోని 108లో ఉద్యోగాలకు తల్లాడ ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు సంస్థ ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ భూమా నాగేందర్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయని పేర్కొన్నారు. 5.4 అడుగుల ఎత్తు, బీఎస్సీ లైఫ్ సైన్స్, బీఎస్సీ నర్సింగ్, డీఎంఎల్‌టీ, జీఎన్ఎం, ఏఎన్ఎం శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులు ఈఎంటీ పోస్టులకు అర్హులని తెలిపారు. తెలంగాణలో ఎక్కడైనా పనిచేసేందుకు సిద్ధంగా ఉన్న వారు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఒక సెట్ జిరాక్స్ పత్రాలతో హాజరుకావాలని సూచించారు.

హైవే పేరుతో మా ప్లాట్లు లాక్కోవద్దు..

రఘునాథపాలెం: రఘునాథపాలెంలోని సర్వే నంబర్ 218లో 725 మంది నిరుపేదలకు ఆనాటి ప్రభుత్వం కేటాయించిన ప్లాట్లను హైవే పేరుతో లాక్కుని అన్యాయం చేయొద్దని పలువురు కోరారు. రెండు రోజులుగా రెవెన్యూ, హైవే అధికారులు ఈ ప్రాంతంలో సర్వే చేస్తుండగా బుధవారం పలువురు చేరుకుని మాట్లాడారు. కొందరి ప్లాట్లు పూర్తిగా కోల్పోతుండగా, మరికొందరికి కొద్దిమేర పోతుండటంతో ఏం చేయాలని ప్రశ్నించారు. ఈ విషయమై అధికారులు కనీస భరోసా కల్పించకపోవడం సరికాదని పేర్కొన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి హైవే అలైన్‌మెంట్ మార్చడంతో పాటు తమ ప్లాట్ల స్థలంలో తాగునీరు, విద్యుత్, రహదారుల సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కృష్ణ, నారాయణ, రామయ్య, రాజ్యం, నాగరాజు, నాగుల్‌మీరా, హరికృష్ణ, ప్రసాద్, ముత్తేశ్, జలా శ్రీను, ఇమామ్, సతీశ్, ఉదయ్‌కుమార్, దశరథ్, విజయకుమారి, రమాదేవి, సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు. కాగా, ప్లాట్ల యజమానులకు న్యాయం చేయాలని కోరుతూ మాస్‌లైన్ ఆధ్వర్యాన తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. నాయకులు ఆవుల అశోక్, కేలోత్ లక్ష్మణ్, నాగమణి, వీరమ్మ, రూప, సరస్వతి, రాము, తులసి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించండి



సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌ఓ

కొణిజర్ల: ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకంతో వచ్చే వారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.కళావతిబాయి సూచించారు. కొణిజర్లలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం తనిఖీ చేసిన ఆమె చికిత్స కోసం వచ్చిన వారితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం వ్యాక్సినేషన్‌ను పరిశీలించి ఎప్పటికప్పుడు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. సాధారణ ప్రసవాల సంఖ్య పెరిగేలా గర్భిణులకు అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ చందు, పీహెచ్‌సీ వైద్యాధికారి శారద, ఉద్యోగులు పాల్గొన్నారు.

అమెరికా ఉపాధ్యక్షుడికి పాల్వంచలో బంధువులు



పాల్వంచలో కేక్ కట్ చేస్తున్న చిలుకూరి ఉష బంధువుల కుటుంబ సభ్యులు

పాల్వంచ: అమెరికాలో రిపబ్లికన్ పార్టీ అధికారంలోకి వచ్చి వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన జేడీ వాన్స్‌కు పాల్వంచలో బంధువర్గం ఉండడం విశేషం. జేడీ వాన్స్ సతీమణి చిలుకూరి ఉషది ఏపీలోని కృష్ణా జిల్లా ఉయ్యూరు. వాన్స్, ఉషల వివాహం 2014లో హిందూ సంప్రదాయ పద్ధతిలో జరిగింది. ఉష తాతల కాలం నాటి వారసులైన చిలుకూరి దినకర శాస్త్రి, పూర్ణచందర్‌రావు పాల్వంచ వాసులు. దినకర శాస్త్రి అర్చకుడు కాగా, పూర్ణచందర్ రావు ఉపాధ్యాయుడిగా పనిచేసి రిటైర్ అయ్యారు. ఆయన కుమారులు మాధవ శ్రీకాంత్, వాసు కిరణ్ అమెరికాలో స్థిరపడ్డారు. పూర్ణచందర్‌రావు కూడా ప్రస్తుతం అమెరికాలోనే ఉన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్

అశ్వాపురం: గిరిజన విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలు బోధించాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్ సూచించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలల్లో ఖాళీగా ఉన్న గెస్ట్ లెక్చరర్ల భర్తీకి బుధవారం మండల పరిధిలోని మిట్టగూడెం గ్రామంలోని గురుకుల బాలుర డిగ్రీ కళాశాలలో డెమో తరగతులను నిర్వహించారు. ఈ తరగతులను ఐటీడీఏ పీఓ రాహుల్ పరిశీలించారు. దరఖాస్తుల ఆధారంగా 44 మందిని ఎంపిక చేయగా, జువాలజీ ఆరు, కామర్స్ ఏడు, తెలుగు నాలుగు, ఇంగ్లిష్ నాలుగు, కెమిస్ట్రీ రెండు, కంప్యూటర్ సైన్స్ నాలుగు, ఎకనావిక్స్ నాలుగు, హిస్టరీ రెండు పోస్టులు ఉండగా, 33 మంది డెమో తరగతులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా అధ్యాపకుల బోధన పద్ధతులను పీఓ పరిశీలించారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న కళాశాల భవన నిర్మాణాన్ని సందర్శించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మెనూ అమలుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజనం అందించాలని, సమయానుకూలంగా తరగతులు, క్రీడలు నిర్వహించాలని ఆదేశించారు.

కంటి వైద్యశిబిరానికి స్పందన

భద్రాచలంఅర్బన్: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, మారుతి నర్సింగ్ కాలేజ్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎస్‌ఆర్ వాసవి అసోసియేషన్ యుఎస్‌ఏ, పుష్పగిరి కంటి ఆస్పత్రి సహకారంతో బుధవారం మారుతి నర్సింగ్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఉచిత నేత్ర శస్త్ర చికిత్స శిబిరానికి స్పందన లభించింది. కార్యక్రమాన్ని భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ప్రారంభించి మాట్లాడుతూ అంధత్వ నివారణకు గిరిజన ప్రాంతంలో నేత్ర వైద్య శిబిరం నిర్వహించటం అభినందనీయమని అన్నారు. పలువురికి కంటి పరీక్షలు నిర్వహించారు. 1120 మంది కంటి పరీక్షలు నిర్వహించి, 602 మందిని 15 బ్యాచ్‌లకు కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. 320 మందిని కళ్లజోళ్లు ఇచ్చేందుకు ఎంపిక చేశారు. మందులు అందజేశారు. అందరికీ మధుమేహం, బీపీ పరీక్షలు కూడా చేశారు. ఆపరేషన్ చేయాల్సిన మొదటి బ్యాచ్ 40 మందిని హైదరాబాద్‌లోని పుష్పగిరి ఆస్పత్రికి వ్యాన్‌లో తీసుకెళ్లగా, వాహనాన్ని భద్రాచలం ఆర్డీఓ దామోదర్ రావు జెండా ఊపి ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం చైర్మన్ డాక్టర్ ఎస్‌ఎల్ కాంతారావు, వైద్యాధికారులు రవిబాబు, రామకృష్ణ, డాక్టర్ ఆర్.నారాయణ, భద్రాచలం ఎంవీఐ వెంకటపుల్లయ్య, ఎస్ఆర్ వాసవి అసోసియేషన్ అధ్యక్షుడు పందిరి శ్రీనివాసరావు, ప్రెసిడెంట్ రమేష్ బాపనపల్లి, శ్రీరామ్ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

వారి 'కృషి' ఫలించలేదు..

- జ్వరంతో మూడేళ్ల చిన్నారి మృతి



కృషి (ఫైల్)

రఘునాథపాలెం: మూడో పుట్టిన రోజు జరుపుకుని పది రోజులు కాలేదు.. ఇంతలోనే ముద్దుముద్దు మాటలతో తల్లిదండ్రులను అలరిస్తున్న ఆ చిన్నారికి నూరేళ్లు నిండాయి. వివరాలు.. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలంలోని పరికలబోడుతండాకు చెందిన బానోతు సురేశ్ – లోకేశ్వరి దంపతుల కుమార్తె కృషి 3వ పుట్టినరోజు గత నెల 26న నిర్వహించారు. అయితే, లోకేశ్వరి నిండు గర్భిణి కావడంతో ప్రసవం కోసం పుట్టినిల్లయిన కొత్తగూడెం వెళ్లింది. కృషికి జ్వరం రావడంతో అక్కడ చికిత్స చేయించినా ఫలితం లేక ఖమ్మం తీసుకొచ్చి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తుండగా బుధవారం మృతి చెందింది. చిన్నారికి ప్లేట్‌లెట్లు తగ్గడంతో కన్నుమూసిందని వైద్యులు వెల్లడించారు. కాగా, ఆమె మృతితో తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు.

రూపే కార్డుల చోరీపై విచారణ



ఉద్యోగులతో మాట్లాడుతున్న సీఐ సాగర్

తల్లాడ: నాలుగేళ్ల కిందట తల్లాడ సొసైటీ కార్యాలయంలో రూపే కార్డులు చోరీ చేసి రైతుల నగదును డ్రా చేసిన వైనంపై తాజాగా కేసు నమోదైంది. మల్లవరం గ్రామానికి చెందిన దుగ్గిదేవర వెంకటకృష్ణారావు, బెల్లంకొండ చిన్నసైదులుపై కేసు నమోదు కాగా వైరా సీఐ ఎస్.సాగర్ సొసైటీ కార్యాలయంలో బుధవారం విచారణ చేపట్టారు. ఇన్‌చార్జి సీఈఓ కె.నాగబాబు, ఉద్యోగులతో మాట్లాడిన ఆయన వివరాలు ఆరా తీశారు. కాగా, 740 రూపే కార్డుల చోరీ చేసి రూ.40.56లక్షలు డ్రా చేసుకున్న ఘటనలో ఇంకా ఎవరి ప్రమేయమైనా ఉందా అనే కోణంలో విచారణ చేపడుతున్నట్లు తెలిసింది. తల్లాడ ఎస్ఐ బి.కొండల్‌రావు పాల్గొన్నారు.